అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 24 జనవరి 2023

మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూ

నవతెలంగాణ-రాజంపేట్

మైనార్టీ కార్పోరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. ఇందులో 45 మంది దరఖాస్తు చేసుకోగా 38 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్, ఎంపీఓ పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

28, 29న షటిల్ టోర్నమెంట్

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో రచ్చ జగన్నాథ్ స్ఫూర్తి సమితి ఆధ్వర్యంలో రచ్చ జగన్నాథ్ స్మారక షటిల్ టోర్నమెంట్ జనవరి 28, 29 తేదీ లలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రచ్చ జగన్నాథ్ స్మృతి సమితి ప్రతినిధులు రచ్చ శివకాంత్, చౌడేకర్ రాము, సత్యవీర్, అసోసియేషన్ సభ్యులు నర్సింలు, రియాజ్, గణేష్, గంగాధర్, సాయిలు, విఠల్, సునీల్, భూమి స్వచ్ఛంద సేవ సమితి సభ్యులు బసవరాజ్, బాలాజీ, కన్నయ్య గంగాధర్, హరి తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంటకు 15 వేల మద్దతు ధర ఇవ్వాలి

- భారీ వర్షాలతో పంటకు తీవ్ర నష్టం.. తగ్గిన దిగుబడి
- రైతులను ఆదుకోవాలి : సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు పంటకు క్వింటాల్‌కు పదిహేను వేల రూపాయలు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. పసుపు పండించే రైతులకు ఈ సంవత్సరం సరైన దిగుబడి రాకపోవడంతో పాటు పసుపునకు మద్దతు ధర కేవలం క్వింటాలకు 5000 నుండి 5500 వరకు మాత్రమే పలకటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయని అన్నారు. ఎంపీ అరవింద్ పసుపు బోర్డు ఏర్పాటు చేయించి మద్దతు ధర రూ.15,000 కల్పిస్తామని హామీ ఇచ్చి.. దాన్ని పక్కకు పెట్టి సుగంధ ద్రవ్యాల కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులు పండించిన పసుపు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి క్వింటాల్కు 15 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, పల్లపు వెంకటేష్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు, వై. గంగాధర్, కే. గంగాధర్, సుజాత, పి.సూరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

మతోన్మాద మూకదాడులను అరికట్టాలి

- స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం

నవతెలంగాణ-నిజామాబాద్

మతోన్మాద మూక దాడులను అరికట్టాలని స్వేచ్ఛ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అభ్యుదయ వాదులు, హేతువాదులు, టీచర్లు, అంబేద్కర్ వాదులు, నాస్తికులపై మతోన్మాదుల మూక దాడులను అరికట్టాలని, బాధితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మానవహారాలు చేయాలన్న స్వేచ్ఛ జేఏసీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌరస్తాలో సోమవారం మానవహారం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ క వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెవివి జాతీయ ఉపాధ్యక్షులు నర్రా రామారావు, సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమన్న, సిపిఎం జిల్లా నాయకులు పెద్ది వెంకటరాములు, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడారు. మహారాష్ట్రలో నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారే, కర్ణాటకలో ఎంఎం కల్బుర్గి, గౌరీలంకేష్ హత్యలతో ఆడిన రాజకీయ వికృతి క్రీడలో భాగమే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మూకదాడులని ఆరోపించారు. ప్రశ్న లేకపోతే మానవ ప్రగతి లేదని, నేడు ప్రశ్ననే దాడులకు గురవుతుందని అన్నారు. అభ్యుదయ వాదులపై ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మతోన్మాద శక్తులు చేస్తున్న దాడులపై ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగ హక్కులకు విరుద్ధంగా తానే తీర్పులు చెప్పే విధంగా వ్యవహరించి, అరాచక శక్తులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేలా చేసిన కార్పోరేట్‌మీడియాపై చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అభ్యుదయవాదులు, అంబేద్కర్ వాదులు, టీచర్లు, భౌతిక వాదులు, వైజ్ఞానిక ప్రచారకులు, హేతువాదులు, నాస్తికులపై రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్, మతోన్మాదుల మూక దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. దుండగులను చట్ట ప్రకారం శిక్షించాలని, బాధితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పి.సుధాకర్, రామ్మోహన్ రావు, ఎం.సుధాకర్, నర్సింలు, గోవర్ధన్, సూరి, రవి కిరణ్, సంధ్యారాణి, సుజాత, గౌతమ్ కుమార్, గణేష్, శివకుమార్, అశు ర్, వెంకటేష్, గంగాధర్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



మానవహారం చేపట్టి నినాదాలు చేస్తున్న నాయకులు

బీఆర్ఎస్‌కు వైస్ ఎంపీపీ రాజీనామా

విలువ ఇవ్వడం లేదు : గాధారి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్



సదాశివనగర్ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్ రెడ్డి సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో గుర్తింపు లేదని, అంతర్గత విభేదాలు కారణమని సరైన గుర్తింపు లేకపోవడంతోనే రాజీనామా చేసినట్టు వెల్లడించారు. ఎంపీపీలకు, జడ్పీటీసీలకు విలువ ఇవ్వలేదని అన్నారు. పార్టీలో ఒంటెద్దు పోకడలు పోవడం పార్టీ వ్యవహారాలు సక్రమంగా నడపకపోవడంతో పార్టీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. వైఎస్ ఎంపీపీ పదవికి సైతం రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.7.58 లక్షలు

కాలభైరవస్వామి ఆలయంలో లెక్కింపు



హుండీలో వచ్చిన డబ్బులు లెక్కింపు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థాన హుండీ లెక్కింపును సోమవారం దేవాదాయ శాఖ పరిశీలకులు కమల, ఆలయ కార్యనిర్వాహణ అధికారి ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించారు. 4 నెలల నుండి స్వామివారికి కానుకగా రూ.7,58,658 వచ్చినట్లు ప్రభు తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ మాలతి సంతోష్ గుప్తా, పాలకవర్గ సభ్యులు భాస్కర్ రెడ్డి, ఇస్సాయిపేట బైరయ్య, ఎడ్ల రాజయ్య, సర్పంచులు బాలమణి లింబాద్రి, సంజీవ్, ఉప సర్పంచ్ పోతూ నూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

26 నుండి హాత్ సే హాత్ జోడో యాత్ర

నవతెలంగాణ-సదాశివనగర్

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు అనుసంధానంగా ఆయన సందేశాలు నియోజకర్గంలోని పల్లెపల్లెకు, గడప గడపకు తెలియజేసే విధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఈనెల 26 తేదీ నుండి రామారెడ్డి మండల కేంద్రం నుండి ఈ యాత్ర ప్రారంభించనున్నట్టు ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వడ్డపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. సదాశివనగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ యాత్రలో దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న మత విద్వేషాల రాజకీయాలను అదేవిధంగా రాష్ట్రంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాల నుండి టీఆర్ఎస్ సర్కారు చేస్తున్న మోసాలను ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రతి పల్లె పల్లెకు గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజు, కవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ కేంద్రం సందర్శన

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సోమవారం మండల విద్యాధికారి సేవ్ల సందర్శిం చారు. ఫిజియోథెరపీ పరిక్ష చేసే విధానాన్ని డాక్టర్ అరుణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ పరీక్ష ద్వారా శారీరకంగా అభివృద్ధి చెందు తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ టీచర్ పెంటయ్య, సాయన్న, సిఆర్‌పి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవో

ఆలయం వద్ద అన్నదానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మోతే గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న గంగమ్మ ఆలయం వద్ద గంగపుత్రులు సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణం రెండు నెలల్లో పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్, బాలరాజు, సాయిలు, రవి, గంగపుత్రులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి మూడెకరాల భూమి ఇవ్వండి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్ నాయక్
- ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారి నుంచి వెనక్కు తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

ప్రభుత్వ భూమిని దొంగపట్టాలతో తీసుకున్న వారిని నుంచి భూమిని తిరిగి తీసుకొని అర్హులైన వారికి మూడెకరాల భూమిని పంపిణీ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్ నాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గిరిజన సంఘం నాయకులు దుర్గానగర్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు మతు సంగెం ప్రజలు పర్మల్ తండా గిరిజనులు వందల మందితో గాంధారిలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతు సంగెం శివారులో 119, 175 సర్వే నంబర్‌లలో వందల ఎకరాల భూములు పడావుగా ఉండటంతో ఆ భూమిపై కొందరు భూ బకాసురులు గతంలో ప్రభుత్వాధికారులను మచ్చిక చేసుకొని దొంగ పట్టాలు చేసుకున్నట్టు తెలిపారు. అట్టి భూమిపై రైతుబంధు సైతం పొందుతున్నారని అన్నారు. ఇటువంటి వాళ్లను ప్రభుత్వ అధికారులు శిక్షించివారి దగ్గర నుండి భూములను వెనక్కు తీసుకొని ప్రతి పేదకుటుంబానికి మూడెకరాల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు మధు, లింగంపేట మండల నాయకురాలు సావిత్రి, మాతు సంగెం నాయకులు మల్లేష్, మాజీ సర్పంచ్ లక్ష్మీబాయి సరిత వందల మంది రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

'బడి' పనులకు మోక్షం ఎన్నడో

- మన ఊరు మనబడి కింద రూ.60 లక్షల నిధులు మంజూరు
- పనులు చేపట్టక పోవడంతో మట్టి నేలపై మీదే విద్యార్థుల భోజనం

నవతెలంగాణ-బోధన్

మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో ఎంపిక చేసిన పాఠశాలలో పనులు తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పలు సమావేశాలలో అధికారులను ఆదేశిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పనులు సకాలంలో ప్రారంభించక పోవడంతో పెండింగ్ లో ఉంటున్నాయి. పలు చోట్ల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) లో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ ఇతర ఇతర పనులు చేపట్టడానికి ప్రభుత్వం సుమారుగా 60 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. పనులు చేపట్టడానికి నెల రోజుల క్రితమే ఇసుక ,కంకర సైతం తీసుకువచ్చి నిల్వ చేశారు. కానీ పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఈ పాఠశాలలో గల 800 పైచిలుకు విద్యార్థులకు సరిపడా స్థాయిలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కిచెన్ షెడ్ లేక విద్యార్థులు నేలపై మట్టిపై కూర్చుండి భోజనం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. రోజులు గడుస్తున్నా మన ఊరు మనబడి పనులు ప్రారంభం కాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నేలమీదే భోజనం చేస్తున్న విద్యార్థులు



ఇసుక, కంకర కుప్పల నిల్వలు

రిపబ్లిక్ డే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



ప్రజావాణీలో ఫిర్యాదులు స్వీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ఆయా శాఖల ప్రగతిని వివరించేలా శకటాల ప్రదర్శనతో పాటు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఎక్కడ కూడా జాతీయ జెండా గౌరవానికి భంగం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అట్టహాసంగా రిపబ్లిక్ డే ఉత్సవాలు జరిపేం దుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న 'ఈ - శ్రమ్' పోర్టల్ లో అసంఘటిత రంగ కార్మికుల పేర్లను నమోదు చేయించేం దుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచిం చారు. దీనివల్ల కార్మికు లకు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కింద ఉచితంగా రూ. రెండు లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం వర్తిస్తుందని అన్నారు. అర్హులైన అసంఘటితరంగ కార్మికులందరి పేర్లు పోర్టల్‌లో నమోదయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు కోసం 'స్త్రీ నిధి' రుణాలు అందించే కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 79 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 79 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్, డీ పీ ఓ జయసుధ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అమెరికా అమ్మాయి.. గోవింద్‌పేట్ అబ్బాయి

నేడు మూడుముళ్ల బంధంతో ఒక్కటవుతున్న జంట



నేడు ఒక్కటి కానున్న జంట

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌నుట్ గ్రామానికి చెందిన మూగ దేవారం , శుభామణిల కుమారుడు అభిషేక్ చదువు నిమిత్తం అమెరికా వెళ్లి అక్కడ ఉద్యోగం చేస్తున్న తరుణంలో అమెరికాకు చెందిన అలెక్స్ తో పరిచయం ఏర్పడి ప్రేమలో పడ్డారు, సోమవారం జరిగిన ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బండమీది గంగాధర్. మాజీ ఎంపీటీసీ ప్రభుదాస్ వార్డు సభ్యులు నీరడి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.. కాగా ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి నేడు పట్టణంలోని పెర్కిట్‌లోని ఫంక్షన్ హాల్ జరిగే వివాహ బంధంతో ఒక్కటవుతున్నారు. కాగా అభిషేక్ వాళ్ళ బాబాయ్ మూగ ప్రభాకర్ గోవింద్ పెట్ గ్రామ సర్పంచిగా గతంలో పని చేశారు.

శాఖల వారీగా ఉత్తమ అధికారులను ఎంపిక చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ఉత్తమ అధికారులను ఎంపిక చేసి శాఖల వారీగా వారి పేర్లను పర్యవేక్షకుడు సాయి భుజంగరావుకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందే విధంగా అధికారులు చూడాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి విద్యాశాఖ, ఐసిడిఎస్, సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు చేపట్టిన ప్రగతి పనుల వివరాలను సీఈవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏవో రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-రాజంపేట్

నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎల్ శరత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట గ్రామంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేయలేదని అన్నారు. కబ్జాల గురవుతున్న నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువులు పెట్రోల్ డీజిల్ ధర పెంచి సామాన్యులు పేద ప్రజలు బతకడం భారంగా మార్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి బాలరాజు, రాజంపేట మండల సిపిఐ కార్యదర్శి బత్తుల ఈశ్వర్, సిపిఐ రాజంపేట శాఖ కార్యదర్శి హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్డులు అందజేత

డెస్క్ బెంచీలు వితరణ



నవతెలంగాణ-మోర్తాడ్

మండలం దొన్‌పాల్ ప్రాథమిక పాఠశాలకు డెస్క్ బెంచీలు వితరణ చేశారు. హైదరాబాద్‌లో సిరపడ్డ చిట్టాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఏనుగు దయానంద రెడ్డి లక్ష రూపాయల విలువగల డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాలకు వితరణ గా అందించారు. చక్కగా చదువుకొని గ్రామానికి మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను చేధించుకునే విధంగా ముందడుగు వేయాలన్నారు. ఆయనకు గ్రామస్తులు, సర్పంచ్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవన్న, సర్పంచ్ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగమణి, విష్ణువర్ధన్, దండుగంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రానికి చెందిన న్యూ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు బాలికల ఉన్నత పాఠశాలకు క్రీడ సామాగ్రిని ఎస్సై రాజ్‌భరత్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం అందేశారు. మెదక్‌లోని నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్ పోటీలలో 55 ప్లస్ ఏజ్ గ్రూపులో 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 5 కిలోమీటర్ల నడకలో నాలుగవ స్థానంలో నిలిచిన పిడి గోపిరెడ్డి, రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ప్రతిభ కనబర్చిన 9వ తరగతి విద్యార్థిని రవీనాను యూత్ సభ్యులు సన్మనించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘువాస్, ఉపాధ్యాయులు మరియు యూత్ అధ్యక్షుడు రావుట్ల అరవింద్, సభ్యులు నవీన్, హరీష్,ప్రవీణ్,టీఆర్ఎస్ పట్టణ విభాగం అధ్యక్షుడు రాజేష్ తదితరులున్నారు

భగీరథ నీళ్లు రావడం లేదు

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు తమ శాఖల పనితీరును ఎంపీటీసీలకు, సర్పంచులకు వివరించారు. మధ్యలో మాక్లూర్ -1 ఎంపీటీసీ వెంకటేశ్వరరావు లేచి మైనార్టీలు 244 మంది మైనార్టీ లోనుకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారని వారి సెలక్షన్ అధికారులు చేస్తారా... ప్రజాప్రతినిధులకు అప్పజెప్తారా.. ఎంతమందికి ఇస్తారని ప్రశ్నించారు. ఎంపీడీవో క్రాంతి మాట్లాడుతూ తహసీల్దార్, ఎంపీడీవో సమక్షంలో సెలక్షన్ జరుగుతుందని, మండలానికి ఐదు యూనిట్లు వచ్చాయని తెలిపారు. వైద్యశాఖ అధికారి ఆనంద్ మాట్లాడుతూ కంటి వెలుగు మండలంలో 112 రోజులు కొనసాగుతుందని అన్నారు. ఎంపీటీసీ గోవురి ఒడ్డెన్న మాట్లాడుతూ ఎంపిటిసిలకు గౌరవం లేదని సమావేశ పట్టికలో సంతకాలకే పరిమితం అవుతున్నారని సమావేశాన్ని బైకాట్ చేస్తూ వెళ్లిపోయారు. తహసీల్దార్ మాట్లాడుతుండగా సభ్యులు గ్రామానికి ఓ రకమైన రేషన్ బియ్యం వస్తుందని, దొడ్డు రకం కొన్ని గ్రామాలకు వస్తే సన్నం రకం మరికొన్ని గ్రామాలకు వస్తున్నాయని, దీనిపై గ్రామాల్లో ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లతో మాట్లాడి అన్ని గ్రామాలకు ఒకే రకమైన రేషన్ వచ్చేలా చూస్తానాని సమాధానం ఇచ్చారు. అనంతరం మిషన్ భగీరథ పై సర్పంచులు మండిపడ్డారు గ్రామాల్లో బోర్లు తీయించారని, సరిగ్గా మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదన్నారు. గుత్ప, మదనపల్లిలో బోర్లు నడిపిస్తూ నెలకు రూ. 60 వేల నుంచి రూ. 65 వేల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. ప్రతిసారి సమావేశంలో చెబుతున్న పట్టించుకున్న నాధుడే లేదని ఆగ్రహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సక్కి సుజాత, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఎంపీటీసీలకు అవమానం

మండలంలో ఎంపీటీసీలకు అవమానం జరుగుతుందని మండలంలోని కొంతమంది ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి సమీపంలో గల మాదాపూర్ ఎంపిటిసి బొంతల లలిత ఇంటి వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీకంపల్లి ఎంపీటీసీ కాలగడ్డ గంగామణి కి సర్వసభ్య సమావేశం ఎజెండా అందరితో కాకుండా వారం రోజుల తర్వాత అందజేశారన్నారు. మూడు సమావేశాలకు రాకపోతే నోటీసులు అందజేశారు. నెల క్రితమే సముజాయిషి ఇచ్చిన వారం తర్వాత అజెండా ఇచ్చారన్నారు. తోటి ఎంపీటీసీకి అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో తీర్మానాలు లేకుండా ఎంపీటీసీల సంతకాలు లేకుండానే నిధుల కేటాయింపు జరుగుతుందని అన్నారు. గ్రామాల వారీగా, ప్రజాప్రతిపదికన నిధులు కేటాయిస్తున్నారో తెలియడం లేదని తెలిపారు. చిన్న గ్రామాలకు ఎక్కువ పెద్ద గ్రామాలకు తక్కువ నిధులు ఇవ్వడంపై అసంతృప్తి చెందుతున్నామన్నారు. తమ పరిస్థితిపై అధిష్టానానికి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎంపిటిసిలు ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు సత్యనారాయణ, గోవురి వడ్డెన్న, కాళ్ల గడ్డ గంగమని, పురుషోత్తం రావు, మీరాబాయి, బొంతల లలిత, వెంకటేశ్వర్ రావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీలు

సికింద్రాపూర్‌లో భూలక్ష్మి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలం లోని సికింద్రాపూర్ గ్రామంలో అర్చకులు నాగరాజు ఆధ్వర్యంలో భూలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించినట్టు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు అప్పల అరుణ్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ కుంచాల విమలరాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగామణి గంగాదర్, మాజీ ఎంపీపీ మైదం రాజన్న, మాజీ సర్పంచ్ చింతం భుమన్న, ఉప సర్పంచ్ గంగామణి సంతోష్ , యవ నాయకులు అప్పల అరుణ్ కుమార్, ఖాతర్ భుమన్న , డీసీ రవి, తలరి శేఖర్, సత్తెయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన్న నాయకులు

శివసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-బోధన్

శివసేన పార్టీ వ్యవస్థాపకులు బాలా సాహెబ్ థాక్రే 97వ జయంతి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగ సోమవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శివసేన పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శివసేన పార్టీ కార్యకర్తలు, నేతాజీ అభిమానులు రక్తదానం చేశారు . ఈ సందర్భంగా శివసేన జిల్లా అధ్యక్షులు పసులోటి గోపి కిషన్ మాట్లాడుతూ బాలసాహెబ్ థాక్రే, నేతాజీ సుభాష్ చంద్రరబోస్ దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకోవాలని సూచించారు. యువత తమ వంతుగా దేశ సేవ చేయడంలో ఎల్లప్పుడు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 100 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి హాజరయిన సీఐ ప్రేమ్ కుమార్ రక్తదానం చేసిన వారిని అభినందించారు కార్యక్రమంలో పాండవుల భూమన్న, గౌతం గౌడ్, చింతకుల లోకేష్ గౌడ్, రాహుల్ ,బాబు , ఆకుల రాజు,కిరణ్, శ్రీకాంత్, లోకేష్ ,శ్రీకర్, ప్రితం, అనిల్, నాగరాజు, ప్రసాద్, లింగం, వెంకట్, ఆకాష్, యోగేష్, బొంతల్ గంగాధర్ పాల్గొన్నారు.

విద్య హై స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం లో జిరాయత్ నగర్ విద్య ఉన్నత పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్, ఏకీకృత శిశు అభివృద్ధి సేవల పథకం... అంగన్వాడీ అధికారులు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కార్యదర్శి విద్య ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ..బాలికలు ఉన్నత చదువు చదివి ధైర్యంగా దృఢ సంకల్పంతో ముందుకు పోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో భార్గవి, ఏసీడీఓ జ్యోతి, సూపర్వైజర్ నళిని, ప్రాజెక్ట్ అధికారి గణేష్ అంగన్వాడీ టీచర్లు,ల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ , ఇంఛార్జి లావణ్య పాల్గొన్నారు.



బహుమతులను అంజదేస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-కోటగిరి

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాలో అద్భుత ప్రదర్శన కనబర్చి, రాష్ట్ర స్థాయి కి ఎంపికైన కోటగిరి మండల ఉపాధ్యాయ మిత్రులు.రేణుక (తెలుగు) యూపీఎస్ హంగర్గ, సువర్ణ (ఇంగ్లీష్) యూపీఎస్ కొత్తపల్లి, అల్తాఫ్ ఉద్దీన్ పర్వేజ్ (జడ్‌పీహెచ్ఎస్) హంగర్గ ఫారం) ఉర్దూ , నఫీజ్ సుల్తానా (పోతంగల్) ఉర్దూ మీడియం ఉపాధ్యాయులను మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండల విద్యాధికారి నాగనాథ్, మండల పీఆర్‌టీయూ నాయకులు వెంకటేష్, కృష్ణమోహన్ అభినందించి శాలువాతో సత్కరించారు. కోటగిరి మండల పీఆర్‌టీయూ నాయకులు సూదం వెంకటేష్, కులకర్ణి కృష్ణ మోహన్, ఉదయ్ చందర్, కాంప్లెక్స్ హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసంత పంచమికి ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వసంత పంచమి సందర్భంగా బాసరకు ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రిజనల్ మెనేజర్ ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జె.బి.యస్. నుండి బాసర్ వరకు ప్రత్యేక బస్సులు ఈనెల 25 సాయంత్రం నుండి నడుపబడును అని, నిజామాబాద్ నుండి బాసర వరకు, బాసర నుండి నిజామాబాద్ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈఅవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చల్లగర్గలో భూమి కబ్జా

పోలీసులకు ఫిర్యాదుచేసిన బాధితులు

నవతెలంగాణ-ధర్పల్లి

గతంలో ఆయ రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు అందించిన భూములపై గ్రామాల్లో ఆయాగ్రామాల పెద్ద మనుషుల కన్నుపడి అందినకాడికి దోచుకుంటున్నారు, అందుకు ఎవరైనా అడ్డం వస్తే తమవైపు తిప్పుకునేందుకు వారికీ సైతం వాటాలు ఇస్తూ బాధితుల వైపు నోరు మెదపకుండా చూస్తున్నారు,కొందరు అభాగ్యులు అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకోక పోవడంతో కోర్టులను ఆశ్రయించినప్పటికీ వీరి ఆగడాలు ఆగడం లేదని ఆయాగ్రామాల ప్రజలు ఆవేదన వెళ్ళకక్కుతున్నారు, అచ్చం ఇలాంటిదే మండలంలోని చల్లగర్గ గ్రామంలోని మగ్గిడి సువర్ణకు 182 సర్వేనంబర్లో తమ పూర్వీకుల నుండి వచ్చిన 3ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఆమె భర్త చనిపోయి యేండ్లు గడుస్తున్నాయి. వికలాంగుడైన కుమారుని పట్టుకుని వ్యవసాయం చేసున్తాన్నామని, మూడుసంవత్సరాలనుండి తమ గ్రామానికి చెందిన కొందరు ముఠాగా ఏర్పడి తమ భూమిపై కన్నెషి చిత్ర హింసలకు పాల్పడుతున్నారని ఆమె వాపోయింది. గత సంవత్సరం తమ పొలాన్ని దున్నకుండా ట్రాక్టర్ యజమానులకు బెదిరించారని, దున్నేందుకు ఎవరూ రాకపోవడంతో ఇతర గ్రామాలనుండి అధిక డబ్బులు చెల్లించి నాట్లు వేసుకున్నామని ఆవేదన తెలిపారు. కోతకు అడ్డుపడితే అప్పటి సిపి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వెనక్కు తగ్గినా మళ్లీ నాలుగు రోజుల క్రితం రాత్రికి రాత్రి తమ 16 గుంటల భూమిని చదునుచేసి కబ్జా చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమపక్కన గల భూమి సుమారు 15 ఎకరాల వరకు చదును చేశారని తెలిపారు. గ్రామంలో ఇంతజరుగుతున్న ఎవ్వరు పట్టించుకోకపోవడం లేదని బాధితులు ఆవేదన వెక్తం చేస్తున్నారు. వికలాంగుడైన తన కుమారుడు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాడని, తమకుటుంబాన్ని ఆదుకునే వారెరని కంటతడి పెట్టింది. అధికారులు స్పందించి తమ 16 గుంటల భూమి తమకు ఇప్పించాలని బాధితులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు.

దీనిపై తహసీల్దార్ గంగా సాగర్‌కు వివరణ కోరగా చల్లగర్గ గ్రామములోని సర్వేనంబర్ 182లో మొత్తం 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది, అందులో మగ్గిడి సువర్ణ కు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉందని, వారికీ రైతుబంధు,ఇతర ప్రభుత్వ పతకాలు వస్తున్నాయని తెలిపారు. మిగితా భూమిలో కొందరు గ్రామస్థులకు ఒక్కొక్కరికి కేవలం అర ఎకరం చొప్పున ఉంది తప్ప మరెవరికి అధిక మొత్తంలో భూమిలేదని అన్నారు. బాధితులు సర్వే చేయించుకొని హద్దులు పెట్టులోవాలని తెలిపారు.



భూమివద్ద బాధితులు

కంటివెలుగును విజయవంతం చేయాలి

ఎంపీడీఓ రాములు నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎలాంటి లోటుపాట్లు లేకుండా కంటి వెలుగును విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. ఇందల్‌వాయి మండలంలోని ఇందల్ వాయి తండాలో మంగళవారం కంటి వెలుగు శిబిరం ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రారంభిస్తారని తెలిపారు.శిబిరంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా గ్రామ పంచాయతీ అధ్వర్యంలో అన్ని సదుపాయాలను కల్పించాలని ఎంపిడిఓ రాములు నాయక్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి తండాను ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సంతోష్, ఎంపీఓ రాజ్‌కాంత్ రావు, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి అశోక్ కు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కంటి శిబిరంలో అంగన్వాడి, ఆశా, ఐకేపీ, పంచాయతీ సిబ్బంది వైద్య సిబ్బందికి సహకరించాలని మండలంలో ఇదే మొదటి కార్యక్రమం పుర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ఆదేశించారు. విద్యుత్ కోతల్లేకుండా నిరంతరం ఉండేలా చుడాలని సూచించారు. గ్రామంలో ఉన్న టార్గెట్‌ను పుర్తి చేయాలని పేర్కొన్నారు. వీరివెంట వెంకట్ రెడ్డి, ఎంఎస్ఎస్‌లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్...

నవతెలంగాణ- రెంజల్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్ రమేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. 26 జనవరి నీ పురస్కరించుకొని పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ముంబై నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బలరాం, మైనారిటీ సీనియర్ నాయకులు రఫిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే తెలంగాణ అగ్రగామి

- ఉద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వానిది పేగు బంధం
- టీ ఎన్ జీ ఓ ల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- కళ్యాణ మండపానికి రూ. కోటి నిధులు ప్రకటించిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ పదానికి టీ ఎన్ జీ ఓ లు మారుపేరుగా నిలుస్తున్నారని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగులను తాము ఎన్నడు కూడా వేరు చేసి చూడలేదని, వారితో ప్రభుత్వానికి ఉన్నది పేగు బంధం అని మంత్రి స్పష్టం చేశారు. టీఎన్‌జీఓల సంఘం నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్లను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠ్ఠల్ రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, పోలీస్ కమిషనర్ కె.ఆర్.నాగరాజు, మేయర్ నీతూ కిరణ్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీ ఎన్ జీ ఓ సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. అన్ని రంగాల్లో తెలంగాణ యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందంటే, అందుకు ఉద్యోగుల కృషి ప్రధాన కారణమని అన్నారు. సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేస్తూ అట్టడుగున ఉన్న ప్రజల వరకు తీసుకెళ్తున్నారని, ఫలితంగానే అభివృద్ధి చెందిన గ్రామాల సర్వేలో దేశంలోనే ఇరవైకి గాను 19 గ్రామ పంచాయతీలు తెలంగాణకు చెందినవే ఎంపికయ్యాయని హర్షం వెలిబుచ్చారు. వీటిలో ఒక్క నిజామాబాదు జిల్లాలోనివే ఐదు గ్రామాలు ఉన్నాయని గుర్తు చేశారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో టీ ఎన్ జీ ఓ లు విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో ఉద్యోగుల కోసం అన్ని వసతులతో కూడిన కల్యాణ మండపం నిర్మాణానికి రూ. కోటి నిధులు కేటాయిస్తానని అర్బన్ శాసన సభ్యులు బిగాల గణేష్ గుప్తా ప్రకటించగా, తనవంతు తోడ్పాటును అందిస్తానని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి భరోసా కల్పించారు. సామాజిక కార్యక్రమాల్లో సైతం టీఎన్‌జీఓల సంఘం ముందంజలో నిలుస్తోందని జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠ్ఠల్ రావు అభినందించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షురాలు మంజుల, టీ ఎన్ జీ ఓ ల సంఘం బాధ్యులు, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, జడ్పీచైర్మన్ టీఎన్‌జీవోలు

టాస్క్ ఫోర్స్ టీమ్ ముమ్మర దాడులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ వారి సిబ్బంది ఆరో పోలీస్ స్టేషన్ పరిధిలోని డెయిరీ ఫారం, సారంగపూర్ సమీపంలో నమ్మదగిన సమాచారం పేకాట నిర్వహిస్తున్నారని ఆదివారం తనిఖీ చేశారు. 13 మందిని పట్టుకొని ఆరోపోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు వివరాలను సోమవారం వెల్లడించారు. వారి వద్ద నుండి 25,220నగదు, సెల్ ఫోన్స్ 12, ప్లేయింగ్ కార్డు 52, ద్విచక్ర వాహనాలు 2, ఒక ఆటో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్‌లో విజేతలుగా విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు తెలంగాణ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈనెల 22న నిర్వహించగా విజయ్ హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని కరెస్పాండెంట్ ప్రభాదేవి సోమవారం తెలిపారు. అండర్-15 బాలుర విభాగంలో ఎమ్.లోకేష్, అండర్-13 విభాగంలో ఎమ్. ఆకాంక్ష మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కార్యదర్శి డాక్టర్ అమృతలత, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ పి. విజేత అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అమృతలత

బోధన్‌లో 'పరీక్ష పే చర్చ'

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని సాయి ప్రసన్న హైస్కూల్ లో సోమవారం బీజేపీ నాయకులు ప్రధానమంత్రి పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్డులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించిన అనంతరం బీజేపీ ముఖ్య నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి ప్రతిభ చూపిన విద్యార్డులకు బహుమతులు, ప్రసంశ పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, సాయి ప్రసన్న హైస్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాష్ ,బోధన్ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నర్సింగ్ , సినియర్ నాయకులు రామరాజు, సత్యం , హరికృష్ణ , వడ్డేపల్లి సర్పంచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలం లోని మంగల్‌పాడ్ గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపనకు హంపి పీఠాధిపతి విద్యా రణ్య భారతి విచ్చే శారు. ఈ సంద ర్భంగా హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి మాట్లాడుతూ... భారత సంస్కృతి సాంప్రదాయాలు ప్రతీ ఒకరికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, అనంతరం నందిపేట కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, సేవా భావం అలవర్చుకొని నిరుపేదల ఆకలి తీర్చాలని అన్నారు. మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్ శారద దంపతులు పాదుక పూజను నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, మాజీ జడ్పిటిసి సరోజినమ్మ, మంగల్‌పాడ్ ఎంపీటీసీ వనజ నాగరాజు, ఎల్లయ్య యాదవ్, సంతోష్ గౌడ్, పురుషోత్తం, ఠాణాకలాన్ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, లింగం, అబ్బయ్య, గంగారాం సాయిలు పాల్గొన్నారు.



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

సంచార ఓడ్ కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

నవతెలంగాణ-నవీపేట్

కొత్తగా బీసీ -ఏ జాబితాలో గుర్తింపు పొందిన సంచార ఓడ్ కుల సంఘం క్యాలెండర్‌ను రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి సోమవారం ఆయన స్వగృహం వేల్పూర్ లో ఆవిష్క రించా రు. ఈ సందర్భంగా తమ కులానికి క్యాబినెట్ ఆమోదంతో గుర్తింపు ఇచ్చి నందుకు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు పవర్ కైలాష్ మాట్లాడుతూ.. స్వాతంత్రం లభించి 75 సంవత్సరాలు కావస్తున్న ఓడ్ కులానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే రెండు సంవత్సరాల క్రితం గుర్తింపు లభించిందని అన్నారు. సంచార ఓడ్ కులం ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజికంగా అత్యంత వెనుకబడి ఉందని అన్నారు. కనీసం ఒక కుల సంఘం భవనం లేకుండా అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తమ ప్రభుత్వం అణగారిన వర్గాలకు అన్ని విధాలుగా సహకరిస్తుందని ఓడ్ కులస్తులకు అన్ని విధాలుగా సహకరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్, ఉపాధ్యక్షులు సంజీవ్ మోహితే, సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రాజు, విజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ క్యాతం నర్సింలు ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని సునీల్ యువసేన సబ్యులు పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన జైచందర్ వాళ్ళ అమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో సునీల్ యువసేన సభ్యులు బెజ్జారాం భాను, పాలెపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరీపై గ్రామస్తుల హర్షం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామంలోని వీడీసీ భవనానికి, గ్రామంలోని పద్మశాలి సంఘ భవనానికి గ్రామస్తులు అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు సహకరించిన జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్, ఎంపీపీ నల్ల సారికకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామపద్మశాలి సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని హంగర్గ క్లస్టర్‌లో పలు పంటలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. శెనగ, మొక్కజొన్న, ఆయిల్ ఫాం పంటలను క్షేత్రస్థాయి పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై సూచనలు చేసినట్టు ఏఈవో విశాల్ గౌడ్ తెలిపారు. నీటియాజమాన్య పద్ధతులు పాటించి పంటల అధికదిగుబడి సాధించాలని, రసాయన ఎరువులను తగ్గించి, జీవ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సాయులు, రామేశ్వర్, శివాజీ, సలీం పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
మంగళవారం 24 జనవరి 2023

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



నివాళి అర్పిస్తున్న నారెడ్డిమోహన్‌రెడ్డి, సర్పంచ్

నవతెలంగాణ-రామారెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందిన మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన కమ్మరి లింగం కుటుంబాన్ని నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి సోమవారం స్థానిక సర్పంచ్ గీ రెడ్డి మహేందర్ రెడ్డి తో కలిసి సోమవారం పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా అంత్యక్రియల ఖర్చు కోసం రూ, 5000 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. వారి వెంట గ్రామస్తులు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాకలి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు నివారించాలని మంత్రికి వినతి

- యంచ గోదావరి వద్ద బందోబస్తుకు వినతి



మంత్రి వేములకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు ప్రవీణ్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని యంచ గోదావరిలో ఆత్మహత్యలు నివారించాలని యంచ వార్డు సభ్యులు కొట్టాల ప్రవీణ్ కుమార్ రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి కి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాసర గోదావరి ఆత్మహత్యలకు కేంద్రంగా మారిందని, తమవంతుగా కృషి చేస్తున్నా పూర్తిస్థాయిలో కాపాడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గోదావరి వద్ద ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం తరపున తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతరం బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

ఫంక్షన్‌హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



రిబ్బన్‌కట్ చేసి ఫంక్షన్ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గల డిపిఎల్ ఫంక్షన్‌హాల్ సోమవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. లింగంపల్లి గ్రామానికి చెందిన దొడ్ల లక్ష్మగౌడ్ గ్రామ సమీపంలో నూతనంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టారని, శుభకార్యాలకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ సమావేశాలు ప్రవేట్ సమావేశాలు నిర్వహించడానికి ఎంత ఉపయోగపడుతుందన్నారు. ఫంక్షనల్ నిర్వాహకులు ఇరువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బండి రాజయ్య, సర్పంచులు గోవింద్ పెంటయ్య నాయక్, మైనార్టీ నాయకులు నయీమ్, సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి

మాజీ ఎంపీపీ హరిత మిత్రురాలు విజయలక్ష్మి కుటుంబానికి 32 వేల ఆర్థిక సహాయం అందజేసినట్టు ఆమె సోమవారం తెలిపారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన విజయలక్ష్మి భర్త శ్రీనివాస్ ఇటీవలే హార్ట్‌ఎటాక్‌తో మరణించారు. మాజీ ఎంపీపీ హరిత నిర్మల్ జిల్లా లక్ష్మణచందా మండల జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌కుచెందిన ఆమె చిన్ననాటి మిత్రుల సహకారంతో 32వేలు ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, పార్టీ అధ్యక్షులు నట్ట భోజన్న సొసైటీ చైర్మెన్ ఆర్మూర్ గంగన్న, ఎంపీటీసీలు సతీష్ మరియా, రూపాల గంగారెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షులు డికొండ శ్రీనివాస్, చర్చ్ పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో రిపబ్లిక్ డే పోటీలు



ఖండేబల్లూర్‌లో..

నవతెలంగాణ-జుక్కల్

రిపబ్లిక్ డే పురస్కరించుకొని మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌తో పాటు ఔట్ డోర్ గేమ్స్ ఆడిపించారు. దీంతో విద్యార్థులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. గెలుపొందిన వారికి గణతంత్ర దినోత్సవం రోజు నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బాచన్‌పల్లి గ్రామ శివారులోని కొండయ్య కోట వద్ద నిర్మించే హనుమాన్ గుడి నిర్మాణానికి సర్పంచ్ కవితగంగాధర్ సోమవారం భూమిపూజ చేశారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎండోమెంట్ ద్వారా గుడి నిర్మాణానికి 24 లక్షల రూపాయలు మంజూరు చేయించడంతో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కమీటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం

- దళిత బంధులో ఎంపికైన వారి పేర్లు బహిర్గతం చేయాలి
- ఒక్కొక్కరి నుండి 3 నుండి ఐదు లక్షల దోపిడీ
- క్వాలిటీ లేని కంటి అద్దాల పంపిణీ
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వం దళిత బంధు ప్రవేశపెట్టిన ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తుందని, నేటి వరకు అర్హులైన వారికి అందజేసిన డబ్బులను వారి పేర్లతో తెల్ల కాగితంపై గ్రామపంచాయతీలో బహిర్గతం చేయాలని, ఒక్కొక్క లబ్ధిదారుని నుండి మూడు నుండి ఐదు లక్షల రూపాయలను తీసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూలర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి విమర్శించారు. సోమవారం



ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అమ్మఒడి కార్యక్రమంలో వైద్యుడు సంతోష్ ను ఆస్పత్రికి వచ్చిన బాలింత లను గర్భిణీ లను వివరాలను అడిగి తెలుసుకుని విలేక రులతో మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమానికి 200 కోట్లు బడ్జెట్ను కేటాయిస్తే దానిలో ప్రచారానికి 50 కోట్లు వృధా ఖర్చు చేశారని నాణ్యత లేకుండా 30 రూపాయలకు వచ్చే కంటి అద్దాలను పార్టీ కలర్ ఉన్న వాటిని అందజేస్తున్నారని వీటన్నిటిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీబీఐ విచారణ లేక చేపట్టాలని డిమాండ్‌చేశారు. దళితబంధుకు దళితుల వద్ద టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఐదు లక్షల వరకు డబ్బులు తీసుకుంటున్నారని, ఇది ఓపెన్ చాలెంజ్ చేస్తున్నారని దమ్ముంటే ఈ సవాల్ ను స్వీకరించాలని అన్నారు ఆస్పత్రులకు వచ్చే గర్భిణీలకు సరైన వసతులు కల్పించడం లేదని, వారికి వచ్చే డబ్బులు రావడంలేదని, తెలిపారు. అంతకు ముందు ఇందల్ వాయి మండలంలోని చంద్రాయన్ పల్లి గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెవుల మల్లయ్య తండ్రి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి ఆయన కుటుబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోత్యార్ నవీన్ గౌడ్,సంతోష్ రెడ్డి, వెంకటరెడ్డి, జంగిలి లక్ష్మి, కుమ్మరి గంగాధర్, సాయందర్,తోట ప్రకాష్ , వసంతరావు, బాబురావు, వెంగల్, నారాయణ, మున్న, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటివెలుగులో పరీక్షలు చేయించుకోండి

- కలెక్టరేట్‌లో శిబిరం ప్రారంభించి ఉద్యోగులకు పిలుపునిచ్చిన కలెక్టర్



కలెక్టరేట్‌లో ప్రారంభించిన శిబిరంలో టెస్టు చేయించుకుంటున్న అదనపు కలెక్టర్.. పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్/పిట్లం

కంటి వెలుగు శిబిరాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కంటి సమస్య ఉన్నవారు ఈ శిబిరం ద్వారా కంటి అద్దాలు, మందులు ఉచితంగా పొందవ చ్చునని తెలిపారు. రెండు రోజులపాటు ఈ శిబిరం కొనసాగు తుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటివెలుగు ఏర్పాట్లు పరిశీలన

పిట్లం : మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నేటి నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీడీవో వెంకటేశ్వర్లు సోమవారంప రిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిట్లం : కిష్టాపూర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీఐ పోతారెడ్డి

నవతెలంగాణ-రాజంపేట్

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆబ్కారి సిఐ పోతారెడ్డి హెచ్చరిం చారు. సోమవారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దోమకొండ సర్కిల్ పరిధిలోని బిబిపేట్, రాజంపేట, భిక్కనూర్ తాడ్వాయి మండలాల్లోని ఏ గ్రామాల్లో అయినా కల్తీ కల్లు విక్రయించినట్లయితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతేడాది దోమకొండ సర్కిల్ పరిధిలో 109 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

నిరూప్ చిల్డ్రన్ హాస్పిటల్‌ని ప్రారంభించిన మంత్రి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి, అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్ వాడిలో నిరూప్ చిల్డ్రన్ హాస్పిటల్ ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్‌గుప్తాతో పాటు ప్రజాప్రతినిధులు ఆస్పత్రి యాజమాన్యం కలిసి వారి ఆధ్వర్యంలో ఆసుపత్రిని సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఎలాంటి రిస్కు ఉన్న అరుదైన చికిత్స ద్వారా నిరూపించిన ఆస్పత్రిని ఏర్పాటు చేయడం జిల్లాకి గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, టిఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి,,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి , డిసిసిబి వైస్ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి లతోపాటు నిరూప్ చిల్డ్రన్ హాస్పిటల్ యాజమాన్యం వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని కొయ్యగుండు తండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో వాగుకు అడ్డంగా రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో నిర్మించ తలపెట్టిన చెక్ డాం పనులను సర్పంచ్ లలిత రాందాస్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ పులగం రాజు మాట్లాడుతూ చెక్ డ్యాం నిర్మాణంతో రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు విరేశం, స్వామి, రాజు పాల్గొన్నారు.

మిట్టపల్లి క్రీడాకారులకు కాంస్య పతకాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 21 నుంచి 23 వరకు అంబేద్కర్ స్టేడియం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన 9వ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి క్రీడాకారులు బి సంతోష్, జి వినయ్, ఆర్ మురళి లు జిల్లా జట్టు తృతీయ స్థానం పొందడానికి కీలకపాత్ర పోషించినట్లు మిట్టపల్లి వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్ సోమవారం తెలిపారు. ఈ టోర్నమెంట్లో జిల్లా జట్టుకు సారథ్యం వహించిన బి సంతోష్ తెలంగాణ బెస్ట్ ఆల్ రౌండర్ గా ప్రత్యేక బహుమతిని రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె శోభన్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులను సర్పంచ్ తేలు గణేష్, ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్ రావు, ఎంపీటీసీ బాలగంగాధర్, ఎస్ఎంసి చైర్మన్ మాసిపెద్ది శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఒడ్డెం నర్సయ్య, గోపు వెంకన్న, గోపు రాజేశ్వర్, గంగరత్నం, స్కూల్ రాజన్న గ్రామ యువకులు తదితరులు అభినందించారు.

ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం

మిట్టపల్లిలో బాలికల దినోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆడపిల్ల దేశానికి గర్వ కారణమని, ఆడపిల్లను చూడగానే మాతృత్వం గుర్తుకు వస్తుందని, మేకలకు, గేదలకు ఆడపిల్ల పుడితే సంబరాలు చేసుకుంటాం కాని మనకు ఆడబిడ్డ పుడితే మాత్రం ఏడుస్తామని, ఇంకా ఎన్నాళ్ళు ఇలా ఏడువడంలోనే గడపాలని ఇకనైన మారుద్దమని సర్పంచ్ తేలు గణేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సరిత అన్నారు. సోమవారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లలను చదవనిద్దామని, ఆడపిల్లను ఎదగనద్దామని, ఆడపిల్లను పుట్టనిద్దా మని బతకనిద్దామని వారు పిలుపు నిచ్చా రు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రాఘవేందర్ రావు, మమత, అంగన్వాడి టీచర్లు శ్రీలత, విజయ, సరిత, ఎస్ఎంసి చైర్మన్ మాస పేద్ది శ్రీనివాస్,గోపు రాజేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఆశ కార్య కర్తలు, అధ్యాపకులు, పిల్లల తల్లి తండ్రులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌లు, ప్రజాప్రతినిధులు, పిల్లలు

వాసవి మాతకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య యువజన అధ్యక్షుడు గంగా సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్, మండల అధ్యక్షుడు బొడ్ల రాజు, మహిళ ఉపాధ్యక్షురాలు ఉడుగుల నిర్మలమ్మ, ప్రేమలమ్మ, పట్టణ ఉపాధ్యక్షుడు రెడ్డి శెట్టి ప్రసాద్ , బెజ్జం సుజాత, పద్మ రాణమ్మ, మండలి ప్రశాంత్, వనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ గ్రామసభలో పలు తీర్మానాలు



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో పలు తీర్మానాలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్నం గంగమని, ఎంపీడీవో శంకర్, ఎంపీ ఓ గౌసుద్దీన్, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహస్థాపనకు భూమి పూజ

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని ఆరేపల్లి గ్రామంలో సోమవారం శివాజీ విగ్రహ స్థాపనకు భూమి పూజ కార్యక్రమాన్ని ఆర్య క్షత్రియ సంఘ అధ్యక్షులు అంకం సిద్దేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చత్రపతి శివాజీ సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు బిక్కజీ వీరేందర్, బిక్కజీ బాల్వంత్ రావు, మాలిష్ కమలాకర్ రావు, బిక్కజీ దిలీప్, అంకం కృష్ణారావు, బిక్కజీ భూంరావు, భాస్కర్ రావు, వెంకట్ రావు, అరె క్షత్రియ సంఘ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



రామారెడ్డి మండల కేంద్రంలో..

నవతెలంగాణ-విలేకరులబృందం

బిచ్కుంద : బిచ్కుంద మండల కేంద్రంలోని యస్సీ వాడలోని ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు రచ్చ శివకాంత్, బిచ్కుంద మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల సందీప్ విద్యార్థులు పాల్గొన్నారు.**దోమకొండ :** దోమకొండ మండల కేంద్రంలోని సుభాష్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. **పిట్లం :** యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని నేతాజీ సంఘ సభ్యులు కొనియాడారు. జయంతి పురస్కరించుకొని నివాళి అర్పించారు. **రామారెడ్డి :** రామారెడ్డి మండల కేంద్రంలో సర్పంచ్ దండబోయిన సంజీవ్ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.



పిట్లం మండల కేంద్రంలో..

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలో ఇంద్రాల రమేష్ (30) అనే యువకుడు సోమవారం ఉదయం రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట్ గ్రామానికి చెందిన రమేష్ ఉదయం డిచ్ పల్లి కి వచ్చి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ పట్టాలకు సమీపంలో పెట్టి రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం దాదాపు అర్ధకిలోమీటరు దూరం వరకు వచ్చి చెల్లచెదురుగా పడింది. స్థానిక గేట్‌మెన్ డిచ్ పల్లి రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. నిజామాబాద్ రైల్వేపోలీసులు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం గుర్తు పట్టకుండా చెల్లాచెదురుగా పడిపోయింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించారు.

టీపీసీసీ ఇంచార్జ్ మాణిక్‌రావు టాక్రేను కలిసిన ఎలమంచిలి శ్రీనివాస్

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ తిరుగులేని పార్టీగా 40 సంవత్సరాల నుంచి కొనసాగుతుందని రాష్ట్ర మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాస్ రావు సోమవారం టీపీసీసీ ఇంచార్జ్ మాణిక్ రావు టాక్రేతో మర్యాదపూర్వకంగా కలిసి చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ సహకారాలు కావాలని ఆయనతో మాట్లాడినట్లు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గంలో అసలైన అభ్యర్థిని ఎన్నిక చేయటంలో విఫలం అవుతుందని అన్నారు. దీనివల్ల బాన్సువాడ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి గురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం పరిచినారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు పొందాలంటే అసలైన అభ్యర్థిని ఎన్నిక చేయాలని అందుకు సహకరించాలని వారితో చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు.

ఆకృతిలో సందడి చేసిన సినీనటి అనసూయ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో ప్రముఖ వస్త్ర దుకాణంలో ఆకృతిలో ప్రముఖ సినీనటి అనసూయ భరద్వాజ్ సందడి చేశారు. ఆకృతి 11 వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ప్రజలకు మెచ్చే విధంగా నచ్చే విధంగా వారికి అనుగుణంగా సరైన రీతిలో తక్కువ ధరలతోనే తీసుకొస్తున్నామని ఆకృతి చైర్మన్ ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. మూడు రకాల కంచి పట్టుచీరలను ప్రముఖ సినీనటి అనసూయ భరద్వాజ్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనమేల 25వరకు ఉంటుందని వారు తెలిపారు.ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటి భరద్వాజ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఆకృతిలో షాపింగ్ మాల్‌లో వీవర్స్ ద్వారా ఎంపిక చేసిన పట్టుచీరలను తామర, కిమయ, విభవరి పట్టుచీరలను తీసుకొచ్చారని అనసూయ తెలిపారు. మహిళలు మెచ్చే విధంగా చీరలను ఆకృతి యజమాన్యం అందిస్తుందన్నారు. సెల్ఫీలు దిగుతూ అందరితో సరదాగా సందడి చేసింది. ఇప్పుడు వచ్చే మైఖేల్ సినిమా అందరిని ఆదరిస్తుందని ఈ సందర్భంగా తెలిపింది. తనకు నచ్చితే పక్క అన్ని మంచి సినిమాలు తీస్తానని వివరించింది. సరదాగా చాలాసేపు మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. వెళ్తూ వెళ్తూ ప్రజలు, ప్రేక్షకుల అడిగిన కోరిక మేరకు పాటలకు సినిమా స్టెప్పులు వేసింది. కార్యక్రమంలో డైరెక్టర్లు ధన్పాల్ ఉదయ్ కుమార్, ధన్ పాల్ ప్రణయ్ కుమార్, మణిమాల, అంజలి, అనిత, శ్రీవాణి, రాఘవేందర్, స్రవంతి వారి కుటుంబ టద్ద ఎత్తున యువకులు మహిళా సోదరిమణు పాల్గొన్నారు.



కంచిపట్టుచీరల ప్రదర్శనమేళాను ప్రారంభిస్తున్న అనసూయ

హర్షిత డెంటల్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరం లోని ఖలీల్‌వాడిలో హర్షిత డెంటల్ హాస్పిటల్‌ను సోమవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. నిజామా బాద్ నగరంలో నివసిస్తున్న ప్రజలకే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా వచ్చే ప్రజలకు కూడా దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఎన్నో సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఆస్పత్రి యాజమాన్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోధన్ ఎంపీడీవోగా శ్రీనివాస్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండల ఎంపీడీవో గా కే.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతల స్వీకరించిన ఎంపీడీవో శ్రీనివాస్‌కు బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి, ఎంపీఓ మధుకర్, మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దే రాజేశ్వర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు . నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కు వ్యక్తిగత సహాయకులుగా పనిచేశారు. అక్కడినుంచి ఆయనకు పదోన్నతి రావడంతో బోధన్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తానని అన్నారు. గత కొన్ని నెలలుగా బోధధ్ ఎంపీడీవో స్థానం ఖాళీగా ఉండడంతో ఎంపీఓ మధుకర్ ఇంచార్జి ఎంపీడీఓగా వ్యవహరించారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు..



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1995-96లో పదవ తరగతి చదివిన విద్యార్థులు లింబాద్రి గుట్టపై సోమవారం సమ్మేళనం నిర్వహించారు. గడిచిన 27 సంవత్సరాల కాలంలోని మధుర స్మృతులను పంచుకుంటు తమ స్నేహితులో ఆనందంగా గడిపారు. అంతకుముందు తమతో చదివి వివిధ కారణాలతో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మల్లెల లక్ష్మణ్, గొల్లపల్లి మురళీ, జేజే నర్సయ్య హరికృష్ణ, పురస్తు నరేష్‌ను తమ తోటి విద్యార్థులు శాలువా, మెమొంటోలతో సత్కరించారు



విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నిజామాబాద్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసి బోధన్ పట్టణంలో గల శ్రీ విజయసాయి, శ్రీ శిరిడి సాయి మహిళా జూనియర్ కాలేజ్ విద్యా సంస్థ గుర్తింపు రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ బోధన్ పట్టణంలోని శ్రీ విజయ్ సాయి, శ్రీ షిరిడి సాయి మహిళా కళాశాలలు నారాయణ విద్యాసంస్థ పేరుతో బ్రోచర్లు ప్రింట్ చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు మోసం చేస్తూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు చేయడం సరి కాదని అన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారుని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కేంద్రాలు తనిఖీ

నవతెలంగాణ-బోధన్/కోటగిరి

బోధన పట్టణంలోని 20,1,18,37 వార్డుల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాలను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ, కమిషనర్ ఖమర్ ఆహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి వెలుగు కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సౌకర్యాలు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలని వారు సిబ్బందికి సూచించారు. వారివెంట కౌన్సిలర్లు శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, అక్తర్ అహ్మద్, అబ్దుల్ అహ్మద్, గంగారాం, వినోద్ ఉన్నారు.

సాలూరలో

సాలురా మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కంటి వెలుగు కేంద్రంలో కంటి పరీక్షల కోసం వస్తున్న ప్రజలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల కోసం వస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆమె వెంట మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, గ్రామ పెద్దలు కేజీ గంగారం, మోనేగారి సాయిలు ఉన్నారు.

కోటగిరి:కంటి వెలుగు జీవితానికి వెలుగని ఎంపీడీవో మనోహర్ రెడ్డి అన్నారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన ఎంపీడీవోగా మనోహర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఇన్చార్జ్ ఎంపీడీవో మారుతి ద్వారా బాధ్యతలను తీసుకున్నారు. అనంతరం మండల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కంటివెలుగులో ప్రతి ఒక్కరూ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపిఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

బోస్ చైతన్యంతోనే స్వాతంత్ర ఉద్యమంలో యువత

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఘన నివాళ్లు

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపట్టాలకు పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్‌సిటీ:నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్రం ఉద్యమంలో యువతను చైతన్యపరిచారని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. వామపక్షపార్టీల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 వ జయంతిని స్థానిక సుభాష్ నగర్‌లో గల భారత స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్రం కోసం యువతను చైతన్యపరిచారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రస్తుతం బిజెపి, ఆర్ఎస్ఎస్ సుభాష్ చంద్రబోస్ తమ భావజాలం కలవాడు అని ప్రచారం చేసుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అన్ని మతాలను గౌరవించాలనే ఆలోచనను బిజెపి, ఆర్ఎస్ఎస్ మర్చిపోయాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సీనియర్ నాయకులు కంజర భూమయ్య, సీపీఐ(ఎం) నాయకులు వెంకట్రాములు, వెంకటేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఆకుల. పాపయ్య, శివ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా వనమాల కృష్ణ, ఎం.సుధాకర్, సంధ్య, ప్రజా సంఘాల నాయకులు రామ్మోహన్ రావు, సుజాత, భూమయ్య, సుబోద్, అమర్ నాయకులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సుభాష్ నగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ చామకూర ప్రభాకర్ రెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చామకూర ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటం చేసిన యోధుడని, నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అనే నినాదంతో దేశాన్ని జాగృతం చేశారన్నారు. ఆయన పోరాట పటిమకు నిదర్శనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినాన్ని పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటున్నామని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం నాయకత్వానికి గొప్ప ఉదాహరణ అని, దీని నుండి మనం అనేక పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఆయన క్రమశిక్షణ, నిస్వార్థ స్ఫూర్తిదాయకమైన నాయకుడన్నారు.

బోధన్:బోధన్ మండలంలో ఏఐఎస్ బీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సుభాష్‌చంద్రబోస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేతాజీ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని రాష్ట్ర నాయకుడు నాగరాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న, సతీష్, గంగా ప్రసాద్, శీను, రబ్బాని, మహేష్, సౌందర్య, రాధిక, సంధ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : ఆలూర్ మండలకేంద్రంలో..

సాయి ఆదర్శ యువతీ మండలి ఆధ్వర్యంలో..

బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో సోమవారం సాయి ఆదర్శ మహిళ మండలి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహిళ మండలి మండల అధ్యక్షురాలు పద్మాసింగ్, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

ముప్కాల్ :మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశపు అత్యంత ప్రజాదరణ పొందిన స్వాతంత్య సమర యోధుల్లో ఒకరని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎర్రోళ్ల విజయ్ ఈ సందర్భంగా కొనియాడారు. మండలంలోని వేంపల్లి, రెంజర్ల, వెంచిర్యాల, నల్లూర్, కొత్తపల్లి, నాగంపేట్ గ్రామాల్లో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎర్రోళ్ల విజయ్, సెక్రెటరీ బద్దం అశోక్ రెడ్డి, ఉప సర్పంచ్ సువర్ణ లింగం, కమిటీ కోశాధికారి కొత్తపల్లి శంకర్, ఉపాధ్యక్షులు నేర స్వామి, జాయింట్ సెక్రటరీ మధు, కమిటీ సభ్యులు కన్నయ్య, శ్రీను, సుధాకర్, వెంకట్ రెడ్డి, ముస్కు నర్సయ్య, గద్దల గంగాధర్, ఆనంద్ గౌడ్, రిటైర్డ్ ఉపాధ్యాయులుగోపినాథ్ తదితరులు పాల్గొన్నారు..

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామంలో బస్టాండ్ కూడలిలో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజును స్థాపించి బ్రిటిష్ వలస పాలకులపై పోరాడారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను సాధించేందుకు యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నవోదయ యువజన సంఘం సభ్యులు గోవర్ధన్, నేల్ల రమేష్, రవిందర్, రమేష్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైకాని ముఖేష్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, నాయకులు తోట అప్పయ్య, సుమన్, రాజ్ కుమార్, మురళి, జగదీష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :పట్టణంలోని మామిడిపల్లి నలంద హై స్కూల్లో సోమవారం నేతాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మామిడిపల్లి పాత గ్రామపంచాయతీ వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఆలూరు మండల కేంద్రంలో..

ఆలూర్ మండలకేంద్రంలో లినేతాజీ శుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి,ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఆకిడి సత్యం, బర్ల సంతోష్, కుంట హరీష్, వెల్మ గంగారెడ్డి, మోహన్, మనిష్,మల్లయ్య,భోజరెడ్డి మహిపాల్ కార్యదర్శి రాజలింగం, కారోబార్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..



నిజామాబాద్‌సిటీ: నివాళ్లు అర్పిస్తున్న వామపక్షాల నాయకులు

డిచ్‌పల్లి:అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపల్ ఆరతి చిట్ల పాల్గొని నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యులు బచ్చనబోయిన శివ, ఎబివిపి నాయకులు ఎర్రం సురేష్, గజేందర్, నవీన్, సాయి పవన్ రాజ్, ప్రమోద్, సాయి కృష్ణ, సాయి, అభిలాష్, ప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్:నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శనీయుడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్పష్టం చేశారు. సుభాష్ చంద్ర బోస్ 126వ జయంతినీ సాతపూర్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాన బాయ్, రవికుమార్ దంపతులు తమ కుమారుడు విశ్వాస్ జన్మదినం ఇదే రోజు కావడంతో పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు నోటుబుక్కులు పలకలను పంపిణీ చేశారు. అలాగే భవిత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు సైతం వారు పలకలు నోటి పుస్తకాలు పెన్నులను అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, రాధా, విశ్వనాథ్, శైలజ, జయలక్ష్మి బ్రహ్మం, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఉమ్మడి జిల్లాల డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్యంకోసం చేసిన త్యాగాలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి, ఏఎంసి వైస్ చైర్మన్ గోపాల్ , వైస్ ఎంపీపీ ధన బాలరాజ్, సీనియర్ నాయకులు మేక వీర్రా, మేక సత్యనారాయణ, ఉపసర్పంచ్ కంది కృష్ణ కో ఆప్షన్ నెంబర్ కరీం, గ్రామ అధ్యక్షులు నగేష్, తదితరులు పాల్గొన్నారు.



వర్నిలో నివాళ్లు అర్పిస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి, తదితరులు

వైద్య విద్యా కళాశాలలో ట్యూటర్ పోస్టులకు నేటినుండి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ ప్రభుత్వం ఖాళీగా ఉన్న 16 ట్యూటర్ పోస్టలను కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయడానికి అనుమతినిచ్చిందని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 24 నుండి 31 వరకు అర్హులైన అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు నిజామాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఫిబ్రవరి 4న అదనపు కలెక్టర్ (ఎల్‌బి) కార్యాలయంలోని ఐడీఓసీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 16 ట్యూటర్ పోస్టులలో అనాటమీ-04, ఫిజియాలజీ-04, బయోకెమిస్ట్రీ-04, ఫార్మకాలజీ-02 ఫోరెన్సిక్ మెడిసిన్-02 విభాగాల వారీగా భర్తీ చేయనున్నారని తెలిపారు. ట్యూటర్ పోస్టులు పోస్ట్ కాలవ్యవధి 3 సంవత్సరాలు, దరఖాస్తుదారులు 45 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని, ట్యూటర్ల పోస్ట్‌కు గ్రాడ్యుయేట్లు (ఎంఎస్సీ) మెడికల్ సంబంధిత డిగ్రీలో నాన్-మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్‌లను ట్యూటర్స్ పోస్ట్‌కు అర్హులని, ఎంపిక జాబితా తయారీ సమయంలో, సంబంధిత మెడికల్ సబ్జెక్టుల్లో పీహెచ్‌డి ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంలు కళాశాల వెబ్‌సైట్ ఘఘఘ.గ్రఎఘఅటఎ.శీతీస్ర నుండి డౌన్‌లోడ్ చేసి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ కు సమర్పించాలని, సర్టిఫికేట్ ల వెరిఫికేషన్ కోసం ఫిబ్రవరి 02 న అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వేతనం నెలకు 57టవేల ఇవ్వనున్నారని అన్నారు.

శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



జాతర పో స్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామంలోగల నల్లగుట్టలో వెలిసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ జాతర పోస్టర్ ను సోమవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గోషికొండ అశోక్ మాట్లాడుతూ.. పూర్వికులనుండి ఆనవాయితీగా వస్తున్న ఆలయ జాతర మహోత్సవం కార్యక్రమం ప్రతిఏటా ఫిబ్రవరి 5న నిర్వహిస్తామన్నారు. జాతరకు ఎమ్మెల్యే ఆహ్వానించామన్నారు. ఆయన జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ ప్రతాప్ గౌడ్, విడిసి చూర్మెన్ నూకల రమేష్, ఎంపీటీసీ పెండ గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షుడు కోతి శేఖర్ రెడ్డి, దేవాదాయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు,

భీమన్న విగ్రహా ప్రతిష్టాపన



విగ్రహా ప్రతిష్టాపనలో పాల్గొన్న సర్పంచ్, నాయకపోడు సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని రాజరాజేశ్వరి నగర్ గ్రామంలో సోమవారం ఆదివాసి నాయక పోడు సేవా సంఘం ఆధ్వర్యంలో భీమన్న విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల భీమన్న దేవాలయాన్ని నిర్మించారు. నూతనంగా గ్రామం నుండి ఆలయం వరకు భీమన్న ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పురోహితులు మాధవాచారి పర్యవేక్షణలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం అన్నదానం చేశారు. సర్పంచ్ అమరగోని రోజా సదాశివ గౌడ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయక పోడు సేవ సంఘం సభ్యులు రాజేష్, మల్లేష్, నరసయ్య, నవీన్, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకోవడంలో రాజకీయ పార్టీలకు బీఆర్ఎస్ పార్టీ ఆదర్శం

- **బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు అందజేసిన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్**

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన కార్యకర్తను కాపాడుకోవడంలో భారత రాష్ట్ర సమితి మిగతా రాజకీయ పక్షాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని గాంధీనగర్ కు చెందిన బానోత్ శంకర్ ఇటీవల చెట్టుపై నుండి పడి మృతి చెందడంతో వారి సభ్యులైన బనోవత్ కోమలిబాయ్‌కి రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్ ను సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ... సాధారణ సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్సూరెన్స్ పథకం మొదట ప్రారంభించిన పార్టీ కూడ బీఆర్ఎస్ అని అని అన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ బానోత్ అనుష ప్రేమ్ నాయక్, జెడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్‌ఎ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు జమీర్ ఖాన్, పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ పాల్గొన్నారు

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన మండల్ కోఆప్షన్ మెంబర్ కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ జక్రాన్‌పల్లి మండల కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్ కుటుంబ సభ్యులు మండల కేంద్ర మైనారిటీ కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ అక్బర్‌ఖాన్ కుటుంబ సభ్యులు, మైనార్టీ కమిటీ పెద్దలు నియామత్ అలీ, షకీల్, ఫెరోజ్, రహమత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్రమైన చట్టం తీసుకురావాలి

ఏఐపీకేఎంఎస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/సిరికొండ

వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన కేంద్ర శాసనాన్ని తీసుకురావాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్ అన్నారు. సోమవారం తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీసిల్దార్ శ్రీనివాస్ రావు కు సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయగౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంతో పని లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా సమగ్ర శాసన చట్టం చేసి అమలుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు రిపోర్టు ప్రకారం తెలంగాణలో ప్రభుత్వ భూములు 22,55,607 ఎకరాలు 63, 872 ఎకరాల దేవాదాయ భూములు 7,767 ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని 15 సంవత్సరాల క్రితం రిపోర్ట్ అందజేసిన ఇప్పటికీ అతీగతి లేదన్నారు. మిగులు భూములు, అనార్ల వద్ద ఉన్న భూములను వ్యవసాయ కార్మికులకు పంచాలనిచ శాశ్వత ఉపాధి కల్పన చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. సాయగౌడ్ పేర్కొన్నారు. స్వామినాథన్ సిఫారసు ప్రకారం పంటకు 50శాతం శాతం గిట్టుబాటు ధర కల్పించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యవసాయ కార్మికుడికి పదివేల రూపాయలు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల పిల్లలకు న్యాయమైన విద్యా సౌకర్యం వారి కుటుంబాలకు పూర్తి వైద్య సౌకర్యం ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంటా రాజేందర్, మోహన్, సాగర్, మారుతి, మురళి, అంజయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:వ్యవసాయ కార్మికులకు సమగ్ర వ్యవసాయ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజు ఏఐకెపిఎస్ నాయకులు స్థానిక తహశీల్దార్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రవేష్ మాట్లాడుతూ... మండల కేంద్రంలోని 532 సర్వే నంబర్ లోని భూమిని నిరుపేదలకు త్వరితగతిన పోడు చేయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరివెంట సాయిరెడ్డి,రవేష్,నాగాయుట,నడిపన్న,గంగారాం తదితరులు ఉన్నారు.

రెంజల్:రైతు కూలీలకు జీవనోపాధి కరవై తల్లడిల్లుతున్నారని అఖిల భారత రైతు కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వడ్డెన్న స్పష్టం చేశారు. సోమవారం పలు సమస్యలపై తహసీల్దార్ రామచందర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, వేముల గంగాధర్, సంతోష్, పోశెట్టి పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

నవతెలంగాణ - బోధన్

జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం బోధన్ పట్టణంలోని ఉపవిద్యాధికారి కార్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్టు బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కావాలని తెలిపారు. 8 వ తరగతి నుండి 12వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. ప్రజాప్రతినిధిని ఎలా ఉన్నుకోవాలి అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర అనే అంశంపై ఉపన్యాస పోటీలు, ఎన్నికల ప్రచారం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతి అంశానికి పాఠశాల స్థాయిలో ఒకరు, కళాశాల స్థాయిలో ముగ్గురు పోటీలో పాల్గొనాలని పేర్కొన్నారు. కావలసిన సామగ్రి ఎవరి సామాగ్రి వారు తీసుకురావాలని పేర్కొన్నారు.

కలిగోట్ శివాలయం వద్ద అన్నదానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలం కలిగోట్ శివాలయం వద్ద జడ్పిటిసి తనూజ శ్రీనివాస్ రెడ్డి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కలిగోట్ గ్రామ శివారులో గల శివాలయం వద్ద ప్రతి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడంతో జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు మనోహర్‌బాద్ గ్రామానికి చెందిన అల్లూరి శ్రీనివాస్ తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిది

● ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/రెంజల్

ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి, యానంపల్లి తండా, సాంపల్లి గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐదుగురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సాయిలు, నాయకులు గోపు గంగాధర్, బలరాం, మోహన్, గ్రామ శాఖ అధ్యక్షులు ఒసా సంతోష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రెంజల్:మండల కేంద్రమైన రెంజల్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం అందజేశారు. జబ్బర్ ఖాన్ కు 36వేల రూపాయలు, మహమ్మద్ ఉస్మాన్ కు 11వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఫిక్, పాలకవర్గ సభ్యులు సగ్గు వెంకటి, సమ్మి, మంగల్ పాడు లక్ష్మణ్, నారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

29న 21 కిలోమీటర్ల పరుగు పందెం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అంకం హాస్పిటల్ పోలిస్ కమిషనర్ నిజామాబాద్ వారి సంయక్త ఆధ్వర్యంలో ఈనెల 29న 21కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా జిల్లా పోలిస్ కమిషనర్ నాగరాజు హాజరౌతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డా. నీలి రాం చందర్, డా. జలగం తిరుపతి రావ్ తెలిపారు. ఈ రన్ పట్ల అవగాహన కల్పించడానికి ఈ నెల 29వ తేది ఆదివారం రోజు ఉదయం 6గంటల 30నిమిశాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానం నుండి మామిడి పల్లి రైల్వే గేట్, (ఆర్మూర్ రోడ్) వరకు వెళ్లి తిరిగి వెనక్కి పాలిటెక్నిక్ మైదానం వరకు నిర్వహిస్తున్న రన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులే కాకుండా పోలీస్, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగస్తులు ఆసక్తి గల వివిధ అన్ని వర్గాల యువత, వయోజనుల విభాగాలకు చెందిన వారు పాల్గొనవచ్చునని తెలిపారు. అంకం హాస్పిటల్ సహకారంతో గెలిచిన వారికి మొదటి బహుమతి 10వేలు, రెండో బహుమతి ఏడు వేలు, మూడో ప్రైజ్ 5000 వేలు, నాలుగోబహుమతి 3వేలు, ఐదోప్రైజ్ 1500 రూపాయలని, ఆసక్తి గల వారు ౦919154403633 ఫోన్ నంబర్ కు సంప్రదించండని తెలిపారు. పోలీస్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ. ఆరోగ్యమే మహా భాగ్యమని పరుగుపందెం నిర్వహించడం అభినందనీయమనీ అన్నారు.

జక్రన్‌పల్లిలో దోమల మందు పిచికారి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో ప్రతి వార్డులో దోమల నివారణకు మందును సోమవారం పిచికారి చేయడం జరిగిందని సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్ తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృశ్య వీధి వీధినా సర్పంచ్, ఉపసర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్ అధ్వర్యంలో దోమల మందు ఫాగ్గింగ్ చేయించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా

●ప్రకటించిన ఆర్.భాస్కర్

నవతెలంగాణ-ఏర్గట్ల

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష పదవికి, రాష్ట్ర ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆర్.భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏర్గట్ల మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియంతృత్వ వైఖరికి నిరసనగా రాజీనామా చేశానని తెలిపారు. 20 సంవత్సరాల నుండి పిఆర్టియూకు సేవలందించానని, టీచర్ల ప్రధాన సమస్యలపై పోరాడానని పేర్కొన్నారు. రాజీనామాను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా బాధ్యులు ఆమోదించాలని కోరారు.

జగదంబా మాత సేవాలాల్ మందిర వార్షికోత్సవం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలం లోని దుబ్బతాండ జగదంబా మాత సేవా లాల్ మందిర 9 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దశరథ్ నాయక్, ఉత్సవ నిర్వాహకులు మంగ్య నాయక్, కాలురాం నాయక్,రాములు, నాయక్, చందర్, నాయక్ , మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిని కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. డిసిసిబి 101 వ సాధారణ సర్వసభ్య సమావేశం సందర్భంగా భాస్కర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానం చేసినట్టు నాగుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజాంబాద్ ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్, పాల్దే సింగిల్ విండో చైర్మన్ జితేంద్ర పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4 వరకు బీఎడ్ పరీక్ష ఫీజు గడువు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అన్ని అనుబంధ కళాశాలలో గల బి.ఎడ్. కోర్సులో రెండవ సంవత్సరం 3 వ సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్ష ఫీజు గడువు ఫిబ్రవరి 4 వరకు ఉందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ షెడ్యూల్ ను సోమవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి నెలలో నిర్వహించ తలపెట్టినట్లు ఆమె పేర్కొన్నారు. వంద రూపాయల ఆలస్య అపరాధ రుసుముతో ఫిబ్రవరి 7 వరకు రెండు రూపాయల ఆలస్య అపరాధ రుసుముతో ఫిబ్రవరి 8 వరకు, ఐదు రూపాయల ఆలస్య అపరాధ రుసుంతో ఫిబ్రవరి 9 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని అరుణ పేర్కొన్నారు. ఈ విషయాన్ని బీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్, విద్యార్థులు గమనించాలని కోరారు. పూర్తి వివరాలకు www.telanganauniversity.ac.in ను సందర్శించాలని సూచించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలో గల 26 వార్డ్ కౌన్సిలర్ సుజాత రమేష్, 17వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పూజా నరేందర్ టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పోల సుధాకర్, మాజీ అధ్యక్షులు సుంకర రవి, కౌన్సిలర్లు అబ్దుల్ రెహమాన్, ఫయాజ్, గంగా మోహన్ చెక్రు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో

జిల్లా జట్టుకు తృతీయ స్థానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 21 నుండి 23 వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన 9వ సీనియర్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ పోటీలలో జిల్లా జట్టు మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్లో హనుమకొండ జిల్లా జట్టుపై గెలుపొంది తృతీయ స్థానంలో నిలిచిందని కాంస్య పతకాలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ లు సోమవారం తెలిపారు. ఈ టోర్నమెంట్ లో బెస్ట్ ఆల్ రౌండర్ గా బి సంతోష్ (మిట్టపల్లి) క్రీడాకారుడు ప్రత్యేక బహుమతిని అందుకున్నాడు. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా ఎం గంగా మోహన్, ఈ నరేష్, అనిల్ వ్యవహరించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయల సంఘం వారు హర్షం వ్యక్తం చేశారు.

రూ.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించిన మంత్రి వేముల

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడంలో భాగంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఏర్గట్ల మండలకేంద్రంలో 5 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకగా,కులసంఘాల పెద్దలు, నాయకులు పెద్దఎత్తున గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ... మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ ,సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, రైతు బంధు సమితి జిల్లా మెంబర్ నెరేళ్ళ లింగారెడ్డి, ఏర్గట్ల పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య,వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, బద్దం ప్రభాకర్, కొలిప్యాక శ్రీనివాస్, మారు నరేష్,రోక్కెడ మోహన్, సర్పంచులు, ఉపసర్పంచ్లు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి కావాలి

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు సోమవారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. పనులు వేగంగా జరగాలని, నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తి కావాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను మంత్రి అదేశించారు. అనంతరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. అనంతరం భీంగల్ మండలం మెండోర గ్రామ అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ 1.15లక్షల వ్యయం పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.